www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

సోమవారం 06 ఫిబ్రవరి 2023

1

డైరెక్టర్లను మర్యాద పూర్వకంగా కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో అనేక విభాగాలలో, వివిధ హోదాల్లో పనిచేసి సంస్థ డైరెక్టర్లుగా ఎన్నికైన జి.వెంకటేశ్వర్‌రెడ్డి(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), ఎన్‌వికే శ్రీనివాస్(అపరేషన్స్)ను ఆదివారం టీబీజీకేఎస్ నాయకులు సీసీసీ గెస్ట్‌హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డైరెక్టర్లకు శాలువా కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, వెంగల కుమారస్వామి, ఏరియా నాయకులు తొంగల రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంబిడి తిరుపతి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తోటి స్నేహితుల ఔదార్యం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె) గ్రామానికి చెందిన బోగె రాజశేఖర్ గత నెల అనారోగ్యంతో మృతి చెందాడు. కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి ఔదార్యం చాటుకున్నారు. మృతి చెందిన స్నేహితుడి కుమార్తెకు రూ.32వేలు సేకరించి పోస్టాఫీస్‌లో సుకన్య పథకంలో చేర్పి ఖాతాను పోస్ట్ మాస్టర్ భూమన్న ద్వారా రాజశేఖర్ భార్య, కూతురుకు అందించారు.



అభివృద్ధి దిశగా ఆసిఫాబాద్..!

- తుది దశలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం
- ఆకాశాన్నంటిన భూముల ధరలు





నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో ఎన్నో రకాల మార్పులు రావాలి. ఎన్నో రకాల మౌలిక వసతులు కావాలి. వెనుకబడిన ఆసిఫాబాద్ లాంటి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎన్నో విచిత్రాలు జరగాల్సి ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పరిణామాల నేపథ్యంలో ఆసిఫాబాద్ జిల్లాగా అవతరించడంతో అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. జిల్లా కార్యాలయాల నిర్మాణాలు తుది దశకు చేరుకోవడంతో జిల్లా కేంద్రానికి కొత్త శోభ సంతరించుకుంది.

అభివృద్ధి దిశగా జిల్లా కేంద్రం

2016కు ముందు జిల్లా కేంద్రంలో సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ ఉండేది కాదు. జిల్లా ఆవిర్భావం తర్వాత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతోపాటు మార్కెట్ ప్రధాన రహదారి విస్తరణ లాంటి పనులతో జిల్లా కేంద్రం అభివృద్ధి దిశగా సాగుతోంది. గత సంవత్సరం ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా ఏర్పాటు చేసినప్పటికీ కొద్దిరోజులు మాత్రమే పని చేశాయి.

తుది దశలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం

జిల్లా ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రతి జిల్లా కేంద్రాల్లో అన్ని హంగులతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగుతోంది. జిల్లా కేంద్రంలో అన్ని శాఖలతో కూడిన సమీకృత కలెక్టరేట్ భవనం, జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు నూతన పోలీస్‌స్టేషన్ భవనం, గ్రంథాలయం, ఆస్పత్రుల నిర్మాణం లాంటివి తుది దశకు చేరుకున్నాయి. వీటిలో కలెక్టరేట్, డీపీఓ కార్యాలయాలు ముఖ్యమంత్రి చేతుల మీదిగా ప్రారంభోత్సవం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయి.

ఆకాశాన్నంటిన భూముల ధరలు

జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఆసిఫాబాద్ గ్రామపంచాయతీలో ఎక్కువ భాగం ఏజెన్సీలో ఉండడంతో రిజిస్ట్రేషన్ భూములు ఉన్న చోట డిమాండ్ ఎక్కువగా ఉంది. గతంతో పోలిస్తే జిల్లా కేంద్రంలో ప్రస్తుతం మధ్యతరగతి ప్రజలు భూములు కొనే పరిస్థితి లేదు. హైదరాబాద్ లాంటి ప్రాంతాలను తలతన్నే విధంగా జిల్లా కేంద్రంలో రేట్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఏదేమైనా జిల్లా ఆవిర్భావం తర్వాత అభివృద్ధితో పాటు భూముల ధరలు కూడా పెరుగుతూ పోతున్నాయి.



విద్యార్థులకు రక్షణగా..విద్యకు అండగా..!

- గళమెత్తిన ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు
- ప్రారంభమైన టీఏవీఎస్ రాష్ట్ర మహాసభలు
- హాజరైన భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- నేడు జనార్ధన్‌రెడ్డి గార్డెన్‌లో ప్రతినిధుల సభ



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ విద్యార్థులకు రక్షణగా ఉంటూ.. వారు విద్యలో రాణించేందుకు అనుక్షణం అండగా నిలుస్తామని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) నాయకులు భరోసా ఇచ్చారు. ఆదివాసీ విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గళమెత్తుతామని ప్రతినబూనారు. భవిష్యత్తు పోరాటాలతో కర్తవ్య సాధనే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) రాష్ట్ర రెండో మహాసభలు జరిగాయి. ఈ సభలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు తరలివచ్చారు. వీరి రాకతో సభా ప్రాంగణం సందడిగా మారింది. టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మెస్రం రాజు ఆధ్యక్షతన ప్రారంభమైన ఈ మహాసభలకు భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు, ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు, ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, కోటేశ్వర్‌రావు, లంకా రాఘవులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు అండగా..!

ఆదివాసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం టీఏవీఎస్ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విధానాలు, పాలకుల వైఖరి కారణంగా విద్యా వ్యవస్థలో పెచ్చురిల్లుతున్న లోపాలను వివరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా దశల వారీ పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మిడియం బాబురావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో పేద విద్యార్థులకు కలిగే నష్టాలను వివరించారు. ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఇందుకు టీఏవీఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. డీసీసీబీ అధ్యక్షుడు భోజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యావ్యవస్థను మెరుగుపర్చేందుకు అనేక చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులుగా తాము ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. మనువాద మూకలు ఆదివాసుల ఆహారంపై కూడా దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులో రూ.10వేల కోట్లను కోత పెట్టిందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి పోరాడాలని పిలుపునిచ్చారు. కొందరు పాలకులకు ఆదివాసీ అనే పదం పలికేందుకు నోరురావడం లేదని వనవాసీ అనే పేరుతో అడవి మనుషులుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మూలవాసులు ఆర్యులు కాదని ఆదివాసులేనని స్పష్టం చేశారు. ఈ మహాసభ ఆద్యంతం ఆదివాసీ విద్యార్థుల సంక్షేమం.. మౌళిక వసతుల కల్పన, ఉన్నత విద్యా అవకాశాలు, హక్కుల కోసం పోరాడేందుకు అండగా ఉంటుందని చాటిచెప్పింది. అనంతరం సభా ప్రాంగణం నుంచి స్థానిక జనార్ధన్‌రెడ్డి గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఇదే గార్డెన్‌లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నారు. మూడేండ్ల కాలంలో చేపట్టిన పోరాటాలపై సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఈ సమావేశంలో టీఏవీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్రం ఈశ్వర్, బైరి సోమేష్, నాయకులు ఆత్రం తానూష్, మేస్రం నర్మద, కోట్నాక్ పుష్పలత, మాలశ్రీ, టీఏజీఎస్ నాయకురాలు శకుంతల, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.





రిమ్స్‌లో కీళ్ల మార్పిడి విజయవంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రిమ్స్ వైద్య కళాశాలలో మరో నలుగురికి మోకాళ్ల కీళ్ల మార్పిడికి సంబంధించిన శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయినట్లు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు. రిమ్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఇటీవల ముగ్గురికి శస్త్ర చికిత్స చేయగా తాజాగా బజార్‌హత్నూర్, జైనథ్, తలమడుగు, బేలకు చెందిన నలుగురికి శనివారం చికిత్స చేసినట్లు తెలిపారు. చికిత్సకు సహకరించిన నిజామాబాద్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నవీన్‌కు ఆదివారం ఆసుపత్రిలో పూల బొకేను అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు అవినాష్ రాథోడ్, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



45 ఏండ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చిన్ననాటి జ్ఞాపకాలు చెరిగిపోకుండా ఉండేవిధంగా జిల్లా కేంద్రంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో 1976-77 విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 45 సంవత్సరాల తర్వాత విద్యార్థుల ఒకే చోట కలవడంతో వారి ఆప్యాయతకు అంతులేకుండా పోయింది. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని బాగోగులు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు కొమురయ్య సాంబయ్య లను ఘనంగా సన్మానించడంతోపాటు కట్న కానుకలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఎన్నో రకాల ఒడిదుడుకులను ఎదుర్కొన్నామని తెలిపారు. చదువుకున్న కాలం ఎంతో గొప్పదని గుర్తు చేసుకున్నారు. 45 సంవత్సరాల తర్వాత తిరిగి స్నేహితులంతా ఒకచోట కలవడం శేష జీవితంలో మర్చిపోలేని అంశమని అన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయడానికి కృషి చేసిన వారికి ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు అదే బ్యాచ్‌కు చెందిన కొంతమంది ఇప్పటికే మరణించడంతో వారికి నివాళులు అర్పించారు. ఏది ఏమైనా మరోసారి వారంతా కుర్రాళ్ళుగా మారిపోయారు. ఈ కార్యక్రమంలో రావుల వినాయక్, తాటిపల్లి ప్రమోద్, సిద్ధంశెట్టి ఉమేష్, బోనగిరి సతీష్ బాబు, ఇరుకుల ఆంజనేయులు, సాంబయ్య తుకారం, మహమ్మద్, సంజయ్ పాల్గొన్నారు.

గాంధారి ఖిల్లాకు పోటెత్తిన ప్రజలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రామకృష్ణాపూర్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీ సమీపంలోగల గాంధారి మైసమ్మ జాతర చివరోజు ఆదివారం ప్రజలు అధికసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు దర్బార్‌లో ఐటీడీఏ ఏపీఓ రాంబాబు పాల్గొని మాట్లాడారు. వచ్చే గాంధారి ఖిల్లా జాతరలోపు విద్యుత్, మంచినీటి సౌకర్యం, గుట్ట మీదికి వెళ్లే మెట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి గాంధారి మైసమ్మ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీల నాయక్ పోడ్ జిల్లా అధ్యక్షులు మందమర్రి వైస్ ఎంపీపీ ఎల్.రాజ్‌కుమార్ నాయక్, నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంజి రాజన్న, ప్రధాన కార్యదర్శి మేకల రాజ్‌కుమార్, కోశాధికారి కొమ్ము బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఏదుల రాయమల్లు, సహాయ కార్యదర్శి తాండ భీంరావు, మందమర్రి మండల ఎంపీపీ మంగ, మందమర్రి జెడ్పిటిసి వేల్పుల రవి, క్యాతనపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిలర్లు పారుపల్లి తిరుపతి, అనిల్‌రావు, రేవెల్లి ఓదెలు, జాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ 11 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం తమ వంతుగా పేదలు, నిస్సహాయుల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు విశాల్, భూరె సురేష్, గుర్నూలే రామకృష్ణ, సాయిగౌడ్, సీతారాం, నవీన్ పాల్గొన్నారు.

జైనూర్‌లో భారీగా జీరో దందా..!

- పట్టించుకోని అధికారులు
- పత్తి కొనుగోలులో ఇష్టారాజ్యంగా వ్యాపారస్తులు

నవతెలంగాణ-జైనూర్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను అమ్ముకుంటున్న సందర్భంలో భారీగా నష్టపోతున్నారు. ఏజెన్సీ మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్‌కు కేంద్ర బిందువుగా జైనూర్ ఉంది. ఇక్కడ మార్కెట్‌లో పత్తి కొనుగోలులో భారీ ఎత్తున రైతులు మోసపోతున్నారు. రైతులకు అన్యాయం చేస్తున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో పలు కిరాణ యజమానులు పోటాపోటీగా పత్తి కొనుగోలు చేసి గిరిజన రైతులను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పత్తి పంటకు సీసీఐ సరైన ధర ఇవ్వకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారు.

వేచిచూసినా ఫలితం శూన్యం...

ఖరీఫ్‌లో రైతులు పత్తి పంట పండించి దాదాపు నాలుగు నెలలు పూర్తి కావస్తోంది. ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేసే పత్తి ధర రూ.8వేల నుండి రూ.7వేల వరకు పడిపోయింది. రోజురోజుకు రూ.200, రూ.300 తగ్గుతూ వస్తోంది. రోజులు గడుస్తున్నా తగ్గడమే తప్ప పెరగడం లేదు. చివర్లో ధర పెరుగుతుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం గిరిజన రైతులే ఉన్నారు. వారందరూ ధర కోసం వేచిచూసినా రేటు పెరగకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిని ఏరి ఇండ్లలో ఉంచుకొని ఎక్కువ రోజులు కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. వ్యాపారస్తులు పత్తిని ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.





ఆటోలకు కమీషన్‌లు ఇస్తూ పత్తి కొనుగోలు

రైతులు కష్టపడి పండించిన పత్తిని జైనూర్ మండల కేంద్రంలోని వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. సీసీఐ సరైన ధర ఇవ్వకపోవడంతో రైతులు ప్రయివేటు, కిరాణ దుకాణాల్లో అమ్ముకుంటున్నారు. కిరాణ యజమానులు, కిరాణ ఏజెంట్లు ఆటోలకు, ఇతర వాహనాలకు పత్తి తీసుకొస్తే కమీషన్‌లు ఇచ్చి పోటాపోటీగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్క ఆటోకు రూ.100 నుండి రూ.200 వరకు ఇచ్చి పత్తి కొనుగోలు చేయడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సిర్పూర్(యు), జైనూర్, లింగాపూర్ మండలాల్లోని గ్రామాలకు వెళ్లి రైతుల వద్ద బలవంతంగా పత్తి కొనుగోలు చేపడుతున్నారు. అయినా అడ్డుకునేవారే కరువయ్యారు. అధికారుఉ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. సేకరించిన పత్తిని కిరాణ దుకాణ యాజమనులు పెద్ద వాహనాల్లో నింపి ఆదిలాబాద్‌కు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి జీరో దందాను అడ్డుకొని రైతులకు న్యాయం చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ చేసిన అనేక పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులు జీతాలను రూ. వెయ్యి నుండి రూ. 3 వేలకు పెంచుతూ శనివారం జీవో విడుదల చేసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవసభను నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు శారదా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో విడుదల చేయడాన్ని సీఐటీయూ హర్షిస్తుందన్నారు. ఈ జీవోను గత సంవత్సరం మార్చి 15న అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి అమలు చేస్తూ ఎరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే మెనూ చార్జీలు పెంచాలని, కోడి గుడ్లను ప్రభుత్వమే సప్లై చేయాలని, ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6, 7, 8 న మండల కేంద్రాల్లో విజయోత్సవ సభలను జరపాలని జిల్లా కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు ఆర్.త్రివేణి, కష్ణమాచారి, యూనియన్ నాయకులు రూప, పుష్ప, లలిత, లక్ష్మి, హంస, కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల జర భద్రం..!

నవతెలంగాణ-జైపూర్

ఒకప్పుడు టెలిఫోన్(ల్యాండ్‌లైన్) కనెక్షన్ తీసుకోమంటే అబ్బే..మాకెందుకు అనే వారు...ఇప్పుడు ఇంట్లో ఉండే ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కన్పిస్తోంది. అంతే కాదు చిన్న ఫోన్ అంటే చీదరింపు..స్మార్ట్ ఫోన్ వాడకం తప్పనిసరైంది. ఈ క్రమంలో పట్టణవాసులతో పోటీ అన్నట్లుగా పల్లెల్లో స్మార్ట్ ఫోన్ వినియోగం విపరీతంగా పెరుగుతూ వస్తోంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరి చేతిలో సెల్‌ఫోన్ కన్పిస్తోంది. అంతేకాదు చిల్లి గవ్వ చేతిలో ఉండాల్సిన పని లేకుండా బ్యాంకు ఖాతాలో డబ్బులుండి స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు అన్నచందంగా రోజులు గడిచిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నాయి. సాంకేతికతను అందిపుచ్చుకున్న సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల తస్మాత్ జాగ్రత్త అంటూ ఒక వైపు పోలీసులు హెచ్చరిస్తున్నప్పటికీ తెలిసీ తెలియక కొందరు అత్యాశకులోనై సైబర్ మోసాల్లో చిక్కుకుంటున్నారు. అమాయకులు, నిరక్షరాస్యులు మాత్రమే సైబర్ మోసాల్లో చిక్కుకుంటున్నారా..? అంటే కానే కాదు, అన్నీ తెలిసిన వారు, కాస్తోకూస్తో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న సైబర్ కేసులను పరిశీలిస్తే...ఉద్యోగాలు, గిఫ్టులు, లాటరీ, లోన్స్‌కు సంబంధించిన మోసాలు ఎక్కువవుతున్నట్లు తెలుస్తోంది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో సైబర్ నేరాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనరేట్ విడుదల చేసిన ప్రకటనల్లో హెచ్చరించినా అత్యాశపరులు అక్కడక్కడా సైబర్ మోసాల వలలో చిక్కుతున్నారు. నగదురహిత లావాదేవీల(సెల్‌ఫోన్ ద్వారా వివిధ పద్ధతుల్లో) వినియోగం ఎప్పుడైతే పెరిగిందో అప్పటి నుండి ఆన్‌లైన్ మోసాలు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యక్తిగతంగా తెలియని వారు డబ్బులు అడిగినా అనుమానించాల్సిన అవసరమని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. తెలియనివారి పోస్టులు, మెసేజ్‌లకు స్పందించకుండా ఉండడం, ఎవరైన గిఫ్టులు, నగదు బహుమతులు అందిస్తామని చెప్పినప్పుడు వారి మాయమాటలు నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడటం మంచిది. ఉద్యోగాలు ఎరగా వేయడం, వ్యక్తిగతంగా తెలియని వారు అనారోగ్యంతో బాధపడుతున్నామని, చికిత్స కోసం డబ్బులు పంపాలని కోరినప్పుడు నిజనిజాలు తెలియకుండా స్పందిస్తే సైబర్ మోసాల్లో చిక్కుకునే అవకాశం లేకపోలేదు. వీలైనంత వరకు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, నగదు రహిత లావాదేవీలు జరపడం ఎంతమాత్రం మంచిది కాదు. ఒక వేళ ఊహించని రీతిలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టం జరిగినప్పుడు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్(1930-112-100)కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీస్ అధికారులు కోరుతున్నారు. ఫిర్యాదుదారు ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచుకోవడంతో పాటు బ్యాంకు పేరు, ఖాతా నెంబర్, వాలెట్, మర్చెంట్ ఐడీ, యూపీ ఐడీ నెంబర్, లావాదేవీలు జరిపిన ఐడీ నెంబర్ మోసం జరిగిన తేదీతో పాటు సమయం తెలపాల్సి ఉంటుంది. అదేవిధంగా క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా లావాదేవీలు జరిపితే వాటి నెంబర్లు, మోసానికి సంబంధించిన లావాదేవీల స్క్రీన్ షాట్లు తీసి పెట్టుకోవాల్సి ఉంటుందని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.



ప్రశాంతంగా ఎన్‌సీసీ ఏ- గ్రేడ్ సర్టిఫికెట్ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ ఏ గ్రేడ్ సర్టిఫికేట్ కోసం నిర్వహించిన పరీక్ష ముగిసింది. పరీక్షా రాసిన కెడేట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పూర్తి ఏర్పాటు చేశారు. పరీక్షల అబ్జర్వర్ లెఫ్టినెంట్ కల్నల్ పీనకి బానిక్ పరిక్షా తీరును పర్యవేక్షించారు. దాదాపు 850 మంది కెడెట్లు పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు. ఉన్నత చదువులు, ఇతర ఉద్యోగ అవకాశాల్లో ఏ గ్రేడ్ సర్టిఫికేట్ ఎంతో ఉపయోడపడుతుందన్నారు. పదవ తరగతి కెడెట్లకు ఏ సర్టిఫికేట్, ఇంటర్ వారికి బి గ్రేడ్, గ్రాడ్యుయేషన్ చేసే వారి కోసం సీ గ్రేడ్ పరీక్షలుంటాయన్నారు. త్వరలో ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు.

నూతన డీఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్



ఉట్నూర్ డీఎస్పీగా ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డి.నాగేందర్‌ని తన క్యాంప్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, మండల అధ్యక్షుడు తన్నీరు సతీష్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ శాఖ సేవలు అందిస్తామని తెలిపారు. శాంతి స్థాపనకు ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందిచాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా శాఖ కార్యాలయాన్ని ఆదివారం తంతోలి రోడ్డు మార్గంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదం గంగాధర్, డి. సుధాకర్ ప్రారంభించారు. ఈ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర కార్యవర్గ సభ్యులు ఎం.రాజారామ్, బంజ ఆశన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సాగర్, రాందాస్, జి.రాణి, తత్వేందర్, సంజిత, రాహుల్ చంద్రాల పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన రిమ్స్ నర్సుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసిఎస్ స్టాఫ్ నర్సుల 8 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 9వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో 300 ఓసిఎస్ స్టాఫ్ నర్సులు 42 మంది ప్రభుత్వ కాంట్రాక్టులో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, కరోనా కష్టకాలంలోనూ ఫ్రంట్ లైన్ వారియర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం వీరితో వెట్టి చాకిరీ చేయించుకోవటమే తప్ప సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. 11వ పీఆర్సీ విషయంలోనూ సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇతర ప్రాంతాల జిల్లాల నుండి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భుపెల్లి శ్రీధర్, స్టాఫ్ నర్సులు రాజ్యలక్ష్మి, కమల, చంద్రకళ, కృష్ణ కుమారి, వనజ, జయ పాల్గొన్నారు.

వెలమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా పద్మనాయక వెలమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆదర్శనగర్‌లోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిక్యాల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా బి.తిరుమల్‌రావు, గౌరవాధ్యక్షులుగా వర్ధినేని శ్రీధర్‌రావు, కోశాధికారిగా టి.చంద్రశేఖర్‌రావును ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఎల్. మనోహర్‌రావు, సతీష్‌రావు, ఎస్.రాజశేఖర్‌రావు, కె.సుశీల్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా పి.రజనీకాంత్, కె.కృష్ణారావు, బి.రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చొక్కారావు, ఆనంద్‌రావు, బి. రమణరావు, పి.శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. వీరితో పాటు పలువురిని ఈసీ మెంబర్లుగా, సలహా సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రావు మాట్లాడారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల్లో మండల కమిటీలను ఏర్పాటు చేసి సంఘ సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపడతామని తెలిపారు.

12న చలో బంజారా భవన్ కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-నార్నూర్

శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను ఈ నెల 12న హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని విజవంతం చేయాలని లంబాడీ లైవ్ రాష్ట్ర కార్యదర్శి రాథోడ్ సుధాకర్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తడిహత్నూర్ గ్రామంలో జయంతి కరపత్రాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 12వ తేదీన హైదరాబాద్ బంజారా భవన్‌లో గిరిజన లంబాడిల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ పిలుపు మేరకు చలో హైద్రాబాద్‌లో బంజారాల రాష్ట్ర, జిల్లా, మండల గ్రామ స్థాయి నుండి నాయకులు భారీ ఎత్తున హైదరాబాద్‌కి తరలి వచ్చి సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గిరిజనుల సమస్యలపై చర్చలు చేసి ప్రభుత్వానికి వినవించడానికే ఈ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన లంబాడి నాయకులు రాథోడ్ నరహరిదాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జాదవ్ విద్యారాణి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

జిల్లా పరిషత్ పాఠశాలలో 1997-1998 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకొని 25 సంవత్సరాలు గడిచినా సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకలో తమ ఉపాధ్యాయులతో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యాబోధన చేసిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భజన బృందం గానామృతం, విద్యార్థుల నృత్యాలు అందరినీ అలరించాయి. తాము చదువుకున్న పాఠశాలకు ఎల్లవేళలా ఎలాంటి అవసరం వచ్చినా సహాయసహకారాలు అందివ్వడానికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలియజేశారు. గతంలో చదువుకున్న పాఠశాల జ్ఞాపకాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నెమరు వేసుకున్నారు. విద్యనందిచిన ఉపాధ్యాయులు సదాశివరెడ్డి, చిన్నయ్య, రాజమలు, తోటి మిత్రులు మహేందర్, మధుకుమార్ తమ మధ్యలో లేనందున చింతిస్తూ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ వీరేష్ కుమార్, ఎంపిపి అక్షర అనిల్, ఉపాధ్యాయులు కిషన్, సదాశివరెడ్డి, నర్సయ్య, లక్ష్మణ్, నాసిర్ అహ్మద్, ధర్మపురి, లక్ష్మినారాయణగౌడ్, అశోక్‌రెడ్డి, ద్రుపత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, విశ్వనాథ్ వర్మ, వెంకటరమణరెడ్డి, విఠల్‌రావు, మొహినొద్దీన్ 1997-1998 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బద్ది పొచ్చమ్మ ఆలయంలో హోమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో కొలిపుర కాలనిలో శ్రీవేములవాడ బద్ది పొచ్చమ్మగా కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో ఆదివారం హోమం నిర్వహించారు. మాఘ మాసం పూర్ణిమను పురస్కరించుకుని ఈ హోమాన్ని నిర్వహించగా పలువురు భక్తులు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి మకర తోరణంతో అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రయాణికులను గౌరవించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఆర్‌టీసీ ప్రయాణికులను గౌరవించాలని రీజినల్ మేనేజర్ కె..జానీరెడ్డి అన్నారు. నిర్మల్ డిపో ఆధ్వర్యంలో ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్ల శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రయాణికులు సంస్థపై ఆధారపడి లేరని, ప్రయాణికులపై సంస్థ ఆధార పడి ఉందన్నారు. అందుకే ప్రయానికుడిని గౌరవించాలని, చేయి ఎత్తిన చోట బస్సు ఆపాలని, కోరిన చోట దింపాలని డ్రైవర్లకు సూచించారు. ప్రయాణికులు తరచూ ఆర్‌టీసీ బస్సులోనే ప్రయాణించేటట్టు మర్యాదగా ప్రవర్తించాలని, కండక్టర్‌లు, డ్రైవర్‌లు కలిసి బస్సులకు ఆదాయం తెచ్చిపెట్టాలని కోరారు. కండక్టర్ బెల్ కొట్టగానే రోడ్డు మధ్యలో బస్సు ఆపకుండా విధిగా ఎడమ వైపు బస్సు ఆపాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వర్తించాలని, మద్యం తాగి విధులకు రావద్దన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సాయన్న, అసిస్టెంట్ మేనేజర్లు ఐ.రాజశేఖర్, శ్రీకర్, హైర్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు నిబంధనల ప్రకారం సీనియార్టీ లిస్టులు రూపొందించి బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక సంఘ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పమాట్లాడారు. డీఈఓ, ఆర్జెడీల స్థాయిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సీనియార్టీ లిస్టులు నిబంధన ప్రకారం తయారుచేసి పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. 8 ఏండ్ల తర్వాత జరుగుతున్న పదోన్నతుల్లో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ఉపాధ్యాయుల చెక్‌లిస్టులు క్షుణ్ణంగా పరిశీలించి సీనియర్ లిస్టులు తయారు చేయాలని కోరారు. నేరుగా నియామకమైన ఎస్ఏలకు, అంతకుముందు చేసిన ఎస్జీటీ సర్వీస్‌కు పాయింట్లు కేటాయించాలన్నారు. జీరో సర్వీసు ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెండు లేదా అంతకంటే ఎక్కువ పదోన్నతులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులను ఒకే పదోన్నతికి పరిమితం చేయడం సరికాదన్నారు. అప్ గ్రేడ్ చేసిన పండిత, పీఈటీ పోస్టులతో పాటు అన్ని భాషల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. పీఎస్.హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి పదోన్నతులు ద్వారా ఈ షెడ్యూల్లోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ పోస్టులైన ఎంఈఓ, డైట్ లెక్చరర్ పోస్టులకు కూడా పదోన్నతులు కల్పించాలని కోరారు. అంతకుముందు టీయూటీఎఫ్ వ్యవస్థాపకులు స్వర్గీయ స్వామి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.జలంధర్ రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేర దేవన్న, రాష్ట్ర సహాధ్యక్షురాలు ఆర్.సుజాత, గంద్రత్ నారాయణ, జిల్లా కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు వైరాంరెడ్డి, నాయకులు వెంకట్రావు, ఎల్.గంగాధర్, రవీందర్ రెడ్డి అరుణ, కిష్టు, అంబయ్య, భోజా రెడ్డి పాల్గొన్నారు.

నాందేడ్ సభకు బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. కేసీఆర్ నాయకత్వంలో జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని మండల నాయకులు పేర్కొన్నారు. మండల కన్వీనర్ అల్లోల సురేందర్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ గుజ్జరి గణేష్, లింగారెడ్డి, ఈటెల శ్రీనివాస్, జహీర్, నరేష్‌రెడ్డి ఉన్నారు.

ముధోల్ : మహారాష్ట్రలోని నాందేడ్‌జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర రావు నిర్వహించిన బహిరంగ సభకు ఆదివారం మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఆదివారం సుమారు 16ప్రత్యేక వాహనాల్లో పార్టీ కార్యకర్తలు నాందేడ్ జిల్లాకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రేడ్డి, మండల రైతు బంధు అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ శివదత్తసాయినాథ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

శ్రీ శివదత్తసాయినాథ ఆలయ వార్షికోత్సవం మండలంలోని మునిపెల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గల విగ్రహాలకు అభిషేకం చేసి, నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. గ్రామంలోని ప్రధాన వీధులగుండా డప్పు వాయిద్యాలు మంగళహరతుల శివదత్త సాయినాథుని పల్లకినీ ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక హరతి, పూజాకార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ ఉత్సవానికి ప్రముఖ స్త్రీవైద్య నిపుణురాలు అయిండ్ల స్వర్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాయల్ శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో మార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవావళికి మృత్యుంజయ మంత్రాన్ని అందించి విధి రాతను మార్కండేయ మహర్షి ధిక్కరించారని తెలిపారు. కొన్నేళ్లుగా కృషి చేస్తూ చివరికి అనుకున్నట్లుగా మార్కండేయ ఆలయాన్ని నిర్మించుకున్నారని గ్రామస్తులను అభినందించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి డప్పు చప్పుళ్ల మధ్య ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంతోష్, కృష్ణ మయూర్‌చంద్ర, లింగు పటేల్, రాందాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భజన పోటీ బృందాలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని బాలాపూర్ గ్రామంలో ఆదివారం సద్గురు భూమయ్య మహారాజ్ 43వ పుణ్యతిథి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో పాల్గొని భజన పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామ సర్పంచ్ జక్కుల వినోద్ యాదవ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి హాజయ్యారు. వారు మాట్లాడుతూ సంస్కృతిక కార్యక్రమాలతో మనసు ప్రశాంతంగా పనిచేస్తుంది అన్నారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి మనిషికి దిశ నిర్దేశాన్ని సూచించడానికి గురువు అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ సత్‌ప్రవర్తన కలిగి మంచి మార్గంలో పయనించాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, సునీల్ పాల్గొన్నారు.

ముున్సిపల్ చైర్మన్‌కు కౌన్సిలర్ల పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను పలువురు కౌన్సిలర్‌లు పరామర్శించారు. ఇటీవల ఆయన ముక్కుకు సంబంధించిన సైనసిస్ శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లిన అధికార పార్టీ కౌన్సిలర్లు ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అజయ్, కౌన్సిలర్లు రాజు, లక్ష్మణ్, రామ్ కుమార్, కోవా రవి, పందిరి భూమన్న, భరత్, మిశ, స్వాగత్, భూమన్న ఉన్నారు.

అంగరంగ వైభవంగా దేవుని కళ్యాణం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోనిఎడ్ బిడ్ మల్లన్న దేవునికి ఆదివారం చల్లని అంబళ్లను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ప్రారంభమైన రెండవ రోజు ఎడ్‌బిడ్‌తో పాటు మండలంలోని వెంకటపూర్, కారేగం, చింతకుంటా, చించాల, బైంసా మండలంలోని పుస్పూర్, కామోల్, గ్రామాల నుంచి భక్తులు కాలి నడకతో చల్లని అంబళ్ళ నెత్తిపైన తీసుకవచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు సత్యనారాయణ పూజలు చేశారు. అలాగే జాతర ప్రారంభమైన మొదటి రోజు శనివారం రాత్రి దేవుని కళ్యాణ మహోత్సవంను వేద పండితుల మధ్య వైభవంగా జరిగింది. మల్లన్న దేవుని కళ్యాణం తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తరలివచ్చారు. నిర్వాహకులు, గ్రామస్తులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతర బుధవారం వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు లావణ్య రవీందర్‌రెడ్డి, సర్పంచ్ స్వర్ణలతదత్తు, నాయకులు రాజారెడ్డి, విఠల్‌రెడ్డి, మల్లేష్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా హీరాసుక జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

హిరాసుక జయంతి వేడుకలను ఆదివారం మండలంలో ప్రధాన్ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ పాల్గొని హిరాసుక చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని ప్రసంగించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చదువుకోవలన్నారు. దేవాలయ భవన్ నిర్మాణం కోసం, కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

నవతెలంగాణ-తాంసి

మండలంలోని పలోడి గ్రామ సమీపంలోని రాముల గుట్టపై సీతారాముల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాముల గుట్టపై వెలిసిన పురాతన దేవాలయం ఉంది గత ఐదు రోజులుగా ప్రతిరోజూ వేద పండితులు వీరయ్య వెంకటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం చివరి రోజు కావడంతో జంటలతో యజ్ఞం కార్యక్రమం నిర్వహించి సీతారాముల విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. సీతారాముల దర్శించుకునేందుకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ రవికిరణ్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం నీళ్ళ ప్యాకెట్లను అందజేశారు. భక్తుల కోసం గ్రామస్థులు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, గంగారెడ్డి, సతీష్‌రెడ్డి, ఆశన్న గంగారాం పాల్గొన్నారు.

రిమ్స్ ఎదుట ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రిమ్స్ ఎదుట ప్రధాన రహదారిపై ప్రమాద నివారణ చర్యలకు, ట్రాఫిక్ నియంత్రణకు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను నియమించారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిమ్స్‌కు వందలాది మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. ఈ సమయంలో రిమ్స్ ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై ట్రాఫిక్ గణనీయంగా పెరిగి రోడ్డు రద్దీగా మారుతుంది. రోడ్డు దాటి వెళ్లటం కష్టతరంగా మారుతోంది. దీంతో స్పందించిన అధికారులు ప్రమాదాల నివారణకు రిమ్స్ ఎదుట ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను నియమించారు. దీంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-వేమనపల్లి

మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిడ్జాం పోటీలలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నీల్వాయికి చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎండి హర్షిన్ బాను ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సాంబశివరావ్, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ దాసరి మల్లేష్ తెలిపారు. ఈ నెల9 నుంచి 12వ తేది వరకు పాట్నా బీహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెళ్లడానికి ఈ క్రీడాకారినికి ప్రయాణ ఖర్చులను వేమనపల్లి జడ్పీటీసీ రుద్రభట్ల స్వర్ణలత, నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, సర్పంచ్ గాలి మధు అందజేశారు. వీరికి విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో ఉన్న ఎకో టూరిజం హరిత రిసార్టులో పర్యాటకుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఎకో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మనోహర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఉన్న హరిత రిసార్ట్‌ను పరిశీలించారు. టూరిజం పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రిసార్ట్ మేనేజర్ వీరేందర్, ఎంపీటీసీ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని10న చలో కలెక్టరేట్

నవతెలంగాణ-జైపూర్

పడిపోయిన పత్తి దిగుబడిని దృష్టిలో పెట్టుకుని క్వింటాల్ పత్తికి రూ.12 వేల గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌లో ఈ నెల10న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ధరతో సమానంగా సీసీఐతో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కండ్లు తెరువాలి, పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం(ఏఐకేఎస్) తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్) తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయూ) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో పత్తి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అధిక వర్షపాతంతో రాష్ట్ర వ్యాప్తంగా పత్తి దిగుబడి తగ్గిందని, ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి రావల్సివుండగా కేవలం 5 క్వింటాళ్లకే పరిమితం అయ్యిందని పేర్కొన్నారు. సీజన్ ప్రారంభంలో రూ.9,800 పలికిన పత్తి ధర ఇప్పుడు రూ.7 వేలకు లోపుగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ సంస్థలతో దళారులు కుమ్మక్కై పత్తి రేటు తగ్గించడం రైతులను ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సూచించారు. ఆదివారం పట్టణంలోని 5వ వార్డు మజీద్ వాడలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఇంటింటికీ తిరిగి వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కల్యాణలక్ష్మి, షాదిముభారక్, రైతు బంధు, దళిత బంధు, వృద్ధాప్య పింఛన్లు, మిషన్ భగీరథ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు సీఎం అండగా ఉంటున్నారని అన్నారు. పలు సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సుధమల్ల హరికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్/మంచిర్యాల

